నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 24 జూన్ 2025 | HYDERABAD

మోస్తరు వానలు పడొచ్చు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్ లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ ఆవర్తనం మరింత బలపడే అవకాశముండడంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి తేలికపాటి వానలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.4, కనిష్ఠం 24.0, గాలిలో తేమ 64శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

సుమోటోగా ఆగని చలాన్ల మోత

నివేదిక దాఖలుకు కమిషనర్‌కు హెచ్ఆర్‌సీ ఆదేశం

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్‌బజార్: గ్రేటర్ జనంపై 'ఆగని చలాన్ల మోత' అనే శీర్షికతో సోమవారం 'నమస్తే'లో ప్రచురితమైన వార్తను తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. వచ్చే నెల 28వ తేదీలోపు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. చెత్త, నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై పడవేసినందుకు జీహెచ్ఎంసీ 30 సర్కిళ్లలో చలాన్ల ద్వారా భారీ ఎత్తున జరిమానా వసూలు చేసినప్పటికీ ఇంటింటి చెత్త సేకరణ, రోడ్లపై చెత్త/నిర్మాణ వ్యర్థాలు తొలగింపు వంటి పనుల్లో బల్దియా విఫలమైందని, పౌరసేవలను అందించడంలో పరిపాలనా లోపమేనని వచ్చిన వార్తపై సమగ్ర నివేదిక సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించింది.

ఏఎంసీలో చికిత్స పొందుతున్న రోగితో వార్డు బాయ్ శ్రీనివాస్

సీపీఆర్ చేసి.. ప్రాణం పోసి

ఖైరతాబాద్, జూన్ 23 : నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వారికి సపరియాలు చేస్తూ...సేవలందించే నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుడు (వార్డు బాయ్) ఓ రోగి ప్రాణాలను కాపాడాడు. కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలం, పెద్దనుక్కలపేట గ్రామానికి చెందిన బగ్గీ అశోక్ భార్య లక్ష్మితో కలిసి జనరల్ మెడిసిన్ విభాగంలో వైద్య పరీక్షల కోసం పాత ఔట్ పేషెంట్ బ్లాక్‌కు వచ్చారు. అశోక్‌కు అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డు బాయ్ శ్రీనివాస్ వైద్యుల కోసం ఎదురుచూడకుండా సీపీఆర్ చేసి ట్రాలీలో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌కు తీసుకెళ్లి అడ్మిట్ చేశాడు. తక్షణమే వైద్యులు అతనికి ఆక్సిజన్ అందించి చికిత్స చేయడంతో ప్రాణాలు దక్కింది. శ్రీనివాస్ సకాలంలో సీపీఆర్ చేయడం వల్లే రోగి ప్రాణాలు నిలబడ్డాయని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి రోగి ప్రాణాలను కాపాడిన శ్రీనివాస్‌ను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, వైద్యులు అభినందించారు. ప్రస్తుతం అశోక్ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. అశోక్ ప్రాణాలను రక్షించిన శ్రీనివాస్‌కు భార్య లక్ష్మి, బంధువులు, కృతజ్ఞతలు తెలిపారు.

విదేశీ విద్యకు మొండిచేయి!

అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి మంజూరుకాని నిధులు

2వ సెమిస్టర్ ఫీజులు ఖాతాల్లో జమచేయని సర్కార్

అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి నిధులు మంజూరు కాకపోవడంతో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులకు అవస్థలు పడుతున్నారు. 2వ సెమిస్టర్ ఫీజుల చెల్లింపులకు సంబంధించి విద్యార్థుల ఖాతాల్లో నగదు ఇప్పటికీ జమ కాలేదు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నుంచి వివరాలను పంపించినప్పటికీ ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ఫీజుల చెల్లింపు చేయలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కంగారు పడుతున్నారు.

IVలో

మేడ్చల్, జూన్ 23 (నమస్తే తెలంగాణ):

అవినీతి, అక్రమాలు ఒకవైపు.. కుంటుపడుతున్న నగరాభివృద్ధి మరోవైపు..అడ్డదారి పదోన్నతులు.. విధి నిర్వహణలో బాధ్యత లేమి.. ఇలా జీహెచ్ఎంసీ 'ఇంజినీరింగ్' విభాగం పాలన పూర్తిగా గాడితప్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విభాగంలో లోపాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గతేడాది సీఎం రేవంత్‌రెడ్డి రూ. 7వేల కోట్లకు పైగా హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో ఏ ఒక్క చోట పనులు పట్టాలెక్కలేదు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ పనుల టెండర్లలో అక్రమాలకు తెరలేపి..ప్రభుత్వ స్థాయిలో ఫిర్యాదులు రావడంతో ఇంజినీరింగ్ విభాగం నుంచి ఈ పనులు హైడ్రాకు బదలాయించారు. ఇది 'ఇంజినీరింగ్' వైఫల్యమైనని చెప్పవచ్చు. ఇలా ఈ విభాగం అస్తవ్యస్తంగా మారింది. తాజాగా ఇప్పుడు ఈఎన్సీ, సీఈ ప్రాజెక్టు పోస్టింగ్ వ్యవహారం చర్చనీయాంశమైంది.

అక్రమాలు, అవినీతి మరక

గాడితప్పిన ఇంజినీరింగ్

- సీనియర్లను కాదని జూనియర్లకు పెద్దపీట
- ఈఎన్‌సీ, ఎస్ఈ పోస్టులపై రగడ
- సీఈ ప్రాజెక్టు భాస్కర్‌రెడ్డిపై పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ల గరం
- అభ్యంతరం తెలుపుతూ.. మున్సిపల్ సెక్రటరీకి పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అసోసియేషన్ లేఖ
- ఆరుగురు సీనియర్లను కాదని ఒకరికే పోస్టులు ఇచ్చారంటూ ఆక్షేపణ
- నెలలుగా పట్టాలెక్కని ప్రాజెక్టు పనులు
- వివాదాస్పదంగా మారిన భాస్కర్‌రెడ్డి వ్యవహార శైలి

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) :

జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం గాడితప్పింది. తరచూ వైఫల్యాలు వెలుగులోకి వస్తున్నాయి. సైదాబాద్‌లో రోడ్డు వేయకుండానే బిల్లు మంజూరు చేసిన వ్యవహారంలో ఇద్దరు ఇంజినీర్లపై వేటు వేయడం, లంచం తీసుకుంటూ ఇద్దరు ఏఈలు ఏసీబీకి చిక్కారు. దీనికితోడు గతేడాది డిసెంబర్‌లో రైజింగ్ తెలంగాణ పేరిట జరిగిన ఉత్సవాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.7వేల కోట్లకు పైగా హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో ఇప్పటి వరకు ఏ ఒక్క చోట పనులు పట్టాలెక్కలేదు. అంతేకాదు మాన్‌సూన్ ఎమర్జెన్సీ పనుల టెండర్లలో అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ స్థాయిలో ఫిర్యాదులు రావడంతో ఈ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఈ పనులు హైడ్రాకు బదలాయించారు. ఒక ప్రాజెక్టు చేపట్టే ముందు భూసేకరణపై స్పష్టత ఉండాలి. కానీ ఇక్కడ హెచ్‌సిటీ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్‌డీపీలు సరిగా లేకుండానే టెండర్లు పిలవడం, ఆ తప్పును సరిదిద్దుకునేందుకు ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ పిలవడం వరకే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తున్నది.

సంబంధిత ప్రాజెక్టు విభాగం చీఫ్ ఇంజినీర్ తీరుతోనే అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని చర్చించుకుంటున్న తరుణంలో ఆయన వైఖరిపై ఒక వర్గం ఇప్పటికే గుర్రుగా ఉండగా, తాజాగా ప్రభుత్వాన్ని పక్కదారి పట్టించి అడ్డదారిలో వచ్చిన భాస్కర్‌రెడ్డికి జీహెచ్ఎంసీలో ఈఎన్సీ, సీఈ ప్రాజెక్టు పోస్టింగ్ ఎలా ఇస్తారని, సీనియర్లను కాదని జూనియర్ ఇంజినీర్‌కు కీలక పదవి అప్పజెప్పారని స్వయంగా పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ సెక్రటరీకి లేఖ రాశారు. భాస్కర్‌రెడ్డి వ్యవహారం శైలి, లేఖ అంశం తెరమీదకు రావడంతో జీహెచ్ఎంసీలో చర్చనీయాంశంగా మారింది.

జూనియర్‌కు ఎలా ఇస్తారు?

రాయలసీమ ప్రాంతానికి చెందిన భాస్కర్‌రెడ్డి పోస్టింగ్‌లపై మొదటి నుంచీ వివాదాస్పదమే.. మొదటి నుంచి జీహెచ్ఎంసీకి భాస్కర్‌రెడ్డి నియామకంపై గుర్రుగా ఉన్న పలువురు పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు ఏదో రూపంలో తమ అసంతృప్తి వెళ్లగక్కుతూనే ఉన్నారు. భాస్కర్‌రెడ్డి ప్రస్తుతం పబ్లిక్ హెల్త్‌లోనే సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా , చీఫ్ ఇంజినీర్‌గా పలు విభాగాల్లో ఉండడం, అది కూడా పలువురి సీనియర్లను పక్కన పెట్టి పోస్టింగ్‌లు ఇవ్వడమే తీవ్ర అసంతృప్తితో లేఖ రాయడానికి పరిస్థితులు దారి తీశాయి. వాస్తవంగా ఆరు గురు తర్వాత జీహెచ్ఎంసీ ఈఎన్సీ, సీఈ బాధ్యతలు అప్పగించాలి. 2019 నాటి ఫైనల్ సీనియర్ల జాబితాలో 14వ స్థానంలో ఉన్న ప్రస్తుతం

మిగతా IVవ పేజీలో

వినతిని స్వీకరించేందుకు వృద్ధురాలి వద్దకు వచ్చిన కలెక్టర్ హరిచందన

ప్రజావాణికి రాకుంటే షోకాజ్

అధికారులకు కలెక్టర్ వార్నింగ్

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ హరిచందన జిల్లా అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను జిల్లా అధికారులు శాఖల వారీగా పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష చేస్తూ వచ్చే సోమవారం నాటికి పరిష్కరించాలని, దీనిపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రజావాణికి అధికారులంతా సమయానికి హాజరై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వీల్‌ఛైర్‌పై వచ్చిన ఓ దివ్యాంగ వృద్ధ మహిళ వద్దకు వెళ్లి కలెక్టర్ స్వయంగా వినతిపత్రం తీసుకున్నారు. అనంతరం ప్రజావాణి సమావేశాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల స్థానంలో స్టీల్ బాటిళ్లను వినియోగించడం ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఆమె సూచించారు. హైదరాబాద్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిశితా గుండెపోటుతో మృతి చెందడంతో ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, ముకుందరెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఇన్‌చార్జి డీఆర్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ పక్కన బడి!

డీఈవోపై కలెక్టర్ సీరియస్.. నివేదికకు ఆదేశం

సిటీబ్యూరో: బార్ పక్కన స్కూల్ ఎలా నడుస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన జిల్లా విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్కూల్‌పై పూర్తి నివేదిక సమర్పించాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. 'అదిగో బార్.. ఇదిగో స్కూల్'' అంటూ 'నమస్తే'లో ఈనెల 17న ప్రత్యేక కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక అధికారులు సీతాఫల్‌మండిలో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన ఎస్ఎంఎస్ స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆ స్కూల్‌కు విద్యా శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని అధికారులు రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కూడా లేకుండా ఆ భవనం నిర్మించారని.. పాఠశాల కొనసాగింపు ప్రమాదకరమని అందులో పొందుపరిచారు. ఆ స్కూల్ భవనం ఆనుకుని బార్ ఉన్నదని, అందులో ఉదయం 7 గంటల నుంచే మద్యం సరఫరా, తాగుబోతుల వీరంగం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన రోడ్డు పక్కనే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ రిపోర్ట్‌ను డీఈవో కలెక్టర్‌కు పంపించినట్టు తెలిసింది.

'నీకు కార్డు కావాల్నా.. మేం ఇప్పిస్తాం.. మేము సిఫారసు చేస్తేనే.. కార్డు వస్తుంది.. మాకు ఎంతో కొంత ఇవ్వు..లేదంటే.. అసలు కార్డే రాకుండా చేస్తా'.. అని బెదిరింపులు.. మేం చెప్పినోళ్లకే కార్డులు ఇవ్వాలని అధికారులకు ఆర్డర్లు.. రాజధానిలో కాంగ్రెస్ చోటా నాయకుల 'రేషన్..కలెక్షన్ల దందా' తీరు ఇదంటూ..నగరవాసులు ఆరోపిస్తున్నారు. నగరంలో రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు రావడంతో ఇదే అదునుగా ఎంట్రీ ఇచ్చిన హస్తం నేతలు..ఏకంగా దళారుల అవతారం ఎత్తి.. 'చెయ్యి' తడిపితేనే కార్డు అంటూ.. పేదలను ఒత్తిడికి గురి చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మీ సేవ కేంద్రాల్లోనే అడ్డాలు ఏర్పాటు చేసి.. రూ. 1000 నుంచి రూ. 10,000 దాకా దండుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు కొట్టు.. రేషన్ కార్డు పట్టు

చెయ్యి తడిపితేనే పని

కాంగ్రెస్ నేతల దందా

- భారీగా దరఖాస్తులు..మంజూరులో ఆలస్యం
- ఇదే అదనుగా ఎంట్రీ ఇచ్చిన హస్తం చోటా నేతలు
- తామే కార్డులిప్పిస్తామంటూ.. దండుకుంటున్న వైనం
- కార్డుకు రూ.2 వేల నుంచి రూ.10 వేల దాకా వసూలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ):



హైదరాబాద్ జిల్లాలో దరఖాస్తుదారులు అత్యధికంగా ఉండటమే దళారులకు వరంగా మారింది. నగరంలో ఇప్పటి వరకు మెంబర్ ఎడిషన్ దరఖాస్తులు దాదాపు 2,3,000 వేలు ఉండగా, కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారు 2.2 లక్షలపైగానే ఉన్నారు. వారిలో 55 వేలకు పైగా ఎంక్వైరీ పూర్తయింది. 25 వేల మందిని కొత్త కార్డులకు ఎంపిక చేశారు. ఇప్పటి వరకు దాదాపు 3వేల దరఖాస్తుల వరకు రిజెక్టు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా కొంతమంది దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. అన్ని వివరాలను సమగ్రంగా చూసి నిర్ధారించేందుకు సమయం ఎక్కువగా పడుతుండటంతో రోజుకు వెయ్యి దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తవుతున్నదని అంటున్నారు. దీంతో కొంతమేర ఆలస్యమవుతున్నది. దీన్ని ఆసరాగా తీసుకుని కాలనీల్లోని కాంగ్రెస్ సహా పలు పార్టీల నేతలు దళారుల అవతారం ఎత్తి తాము సిఫార్సు చేస్తే రేషన్ కార్డు తొందరగా వస్తుందని దరఖాస్తుదారులను మభ్యపెడుతున్నారు. డబ్బులిస్తే పని తొందరగా పూర్తవుతుందనేసరికి చేసేదేమీ లేక లబ్ధిదారులు అడిగినకాడికి ఇస్తున్నారు.

మీసేవ నిర్వాహకులు, అధికారులను మభ్యపెడుతూ...

ఈ దందాలోకి మధ్య దళారులు మీసేవ నిర్వాహకులు, ఎంక్వైరీ అధికారులను కూడా లాగుతున్నట్లు తెలుస్తున్నది. మీసేవ కేంద్రాల్లోనే తిష్ట వేసి దరఖాస్తుదారుల నుంచి డబ్బు వసూలు చేసి తాము కొంత తీసుకుని మరికొంత మీసేవ నిర్వాహకులకు ఇస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఆయా కాలనీల్లో ఎంక్వైరీ చేసే అధికారులతో ముందుగానే మాట్లాడుకొని తాము చెప్పిన వారి దరఖాస్తులను ముందుగా పరిష్కరిస్తే డబ్బు ముట్టజెపుతామని మభ్యపెడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల కొంతమంది మీసేవ నిర్వాహకులు ఏకంగా విచారణ అధికారులతో మాట్లాడుతూ.. తాము సూచించిన దరఖాస్తును తొందరగా పరిశీలించేలా కోరుతున్నారని, అందుకు దరఖాస్తుకింత

మిగతా IVవ పేజీలో

ఏకశిలలో హైడ్రా

కూల్చివేతలు

సిటీబ్యూరో: కొర్రెముల గ్రామంలో ఏకశిల లేఔట్‌లో ఆక్రమణలను సోమవారం హైడ్రా సిబ్బంది తొలగించారు. గత వారం జరిగిన ప్రజావాణిలో ఏకశిల ప్లాట్ల యజమానులు తమ లేఔట్‌లో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ రంగనాథ్ లేఔట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అక్కడి యజమానులతో మాట్లాడారు. ఆ తర్వాత ఇరుపక్షాల వారిని పిలిచి హైడ్రా కార్యాలయంలో విచారణ జరపడంతో పాటు సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మించినట్లు హైడ్రా నిర్ధారించిందని, అంతేకాకుండా లేఔట్లో రహదారులు, పార్కులకు ఉద్దేశించిన స్థలాలను కూడా నిర్ధారించాలంటూ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం హైడ్రా సిబ్బంది ప్రహరీతో పాటు అక్కడ ఆక్రమణలను తొలగించారు.

ఏకశిల లేఔట్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

సున్నం చెరువు బాధితుల నిరసన

మాదాపూర్: మాదాపూర్ సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను హైడ్రా అధికారులు ఖాళీ చేయాలంటూ నోటీసులను ఇవ్వడంతో పాటు సర్వే చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ.. సోమవారం ధర్నాకు దిగారు. దీంతో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కార్తిక్ రాయల పార్టీ నాయకులు, సున్నం చెరువు బాధితులతో కలిసి ధర్నాకు సంఘీభావం తెలిపి బాధితులతో కలిసి అక్రమ సర్వేను ఆపండి... ప్రజల హక్కులను కాపాడండి అంటూ నినాదాలు చేశారు. సున్నం చెరువు నుంచి బాధితులతో కలిసి 100 ఫీట్ రోడ్డు వరకు ర్యాలీ చేశారు. హైడ్రా డౌన్ డౌన్, వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేస్తూ.. సున్నం చెరువు పూడిక తీతను అడ్డుకున్నారు. దీంతో బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొని హైడ్రాకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కార్తిక్ రాయల మాట్లాడుతూ... సున్నం చెరువు బాధితులను హైడ్రా అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

నిర్లక్ష్యంపై రోడ్డెక్కి..

గోల్నాక: సమస్యలు పరిష్కరించడంతో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ రోడ్డెక్కారు. వెంటనే పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన సోమవారం పటేల్ నగర్ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. పటేల్‌నగర్ చౌరస్తాలో నాలా రిటైయినింగ్ వాల్ నుంచి కొన్ని రోజులుగా మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులతో పాటు వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎన్నో సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన తెలిపినట్లు చెప్పారు. రెండు రోజుల్లో నాలాలో పూడికతీత పనులు చేపట్టి, వీలైనంత త్వరగా ప్రహరీ నిర్మిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

పటేల్ నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్